క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

వీపనగండ్ల: మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కతలప్ప తెలిపారు. మండలంలోని సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో పాల్గొనాలని సూచించారు.

సింగిల్‌విండోలో సభ్యత్వానికి దరఖాస్తులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండోలో కొత్తగా సభ్యత్వం తీసుకునేందుకు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈఓ భాస్కర్‌గౌడ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుంటే వచ్చే సింగిల్ విండో ఎన్నికలల్లో ఓటు హక్కు లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆర్ఓఆర్, ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు ఫొటోలు జతపరిచి రూ.350 సభ్యత్వ రుసుం చెల్లించాలని, ఆయా దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని వారు కోరారు.

అమరచింత ఎస్ఐ బదిలీ

అమరచింత: మండల ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జగన్మోహన్ నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈమేరకు శనివారం రాత్రి ఆదేశాలు రావడంతో ఎస్ఐ లింగాలకు బయలు దేరారు. ఏడు నెలల కిందట బాధ్యతలు స్వీకరించిన అనంతరం అతితక్కువ కాలంలోనే బదిలీ అయ్యారు.

అయోధ్య యాత్రికులకు సన్మానం



అమరచింత: పట్టణానికి చెందిన రమేష్, పరశురాం, భీమరాజ్, చిన్న, వినోద్ పట్టణం నుంచి నుంచి అయోధ్య నగరానికి మూడు బైక్‌లపై ఈ నెల 20న వెళ్లారు. బలరాముడి దర్శనం అనంతరం తిరిగి 25న అయోధ్య నుంచి అమరచింతకు బయలుదేరారని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి రాజు తెలిపారు. ఆదివారం పట్టణానికి వచ్చిన యువకులను సన్మానించారు. కార్యక్రమంలో బాలస్వామి, విజయ్, రాకేశ్‌శెట్టి, మాసన్న, సురేందర్ పలువురు పాల్గొన్నారు.

యాదవ కమిటీ ఎన్నిక

పెబ్బేరు రూరల్: మండలంలోని రాంపూర్‌లో ఆదివారం శ్రీకృష్ణ గొర్రెల పెంపకందారుల సంఘంను జిల్లా సహకార అధికారి రమేష్‌బాబు ఆధ్వర్యంలో గ్రామ యాదవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీచుపల్లి, ఉపాధ్యక్షుడిగా గట్టయ్య, కార్యవర్గ సభ్యులుగా ఆడెం నాగరాజు, గట్టయ్య, చెన్నమ్మ, రాముడు, చిట్టెమ్మ, చిన్న కురుమన్నను ఎనుకున్నారు.

రక్షణ గోడ నిర్మించండి



వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె వాగు వద్ద వంతెనపై రక్షణ గోడను పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని మండల ప్రజలు తెలుపుతున్నారు. మండల కేంద్రం నుంచి పెబ్బేరు పట్టణానికి వెళ్లేందుకు ప్రధాన రహదారి కావడంతో అధిక మొత్తంలో వాహనదారులు ఈ రోడ్డు వెంటే ప్రయాణిస్తుంటారు. రాత్రి వేళల్లో రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదాలు అయ్యే పరిస్థితి నెలకొందని, విషయాన్ని ఉన్నత స్థాయి అధికారులు గమనించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా రైతువేదికలు



అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్, పాంరెడ్డిపల్లే, నందిమళ్ల క్యాంపు కాలనీలో నిర్మించిన రైతువేదికలు అస్తవ్యస్తంగా మారాయి. రైతు ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర నిధులతో ఒక్కోదానికి రూ.20లక్షలు వెచ్చించి నిర్మించిన ఇవి ప్రస్తుతం మరుగునపడ్డాయి. వ్యవసాయ క్లస్టర్ పరిధిలోని రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు వ్యవసాయ అధికారులకు ఉపయోగపడే విధంగా నిర్మించారు. ప్రస్తుతం వీటిని వినియోగించుకోలేక పోవడంతో దుమ్ముధూళితో పాటు కిటికీలు, తలుపులు విరిగిపోతున్నాయి. అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

శంకుస్థాపనకే పరిమితమైన రోడ్డు

- రోడ్డు, బ్రిడ్జి పనులకు రూ.5.90 కోట్లు మంజూరు
- ఆందోళనలో రెండు గ్రామాలు, మూడు తండాల ప్రజలు



బీటీగా మారనున్న పర్వతాపురం రోడ్డు

ఖిల్లాఘనపురం: పల్లె ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డుకు మోక్షం లభించిందని సంతోషం పడిన ప్రజల ఆశలు నెరవేరడంలేదు. గతుకుల రోడ్డు కాస్త తారు రోడ్డుగా మారనుందని, అప్పారెడ్డిపల్లి నుంచి పలు గ్రామాలు, గిరిజన తండాలను కలుపుతూ కర్నెతండా మీదుగా వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు వీలుంటుందని ప్రజలు ఎంతో ఆనందపడ్డారు. వారి ఆశలు నెరవేరేందుకు ఇంకా సమయం పట్టేలా ఉంది. ఈ దారి వెంట ప్రభుత్వం బీటీ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరైన పనులు ముందుకు సాగడం లేదు. పనులు పూర్తి చేస్తే రెండు గ్రామాలు, మూడు గిరిజన తండాల ప్రజలకు మేలు కలుగుతుంది.

రూ.కోట్ల నిధులు మంజూరు..

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి పర్వతాపురం, గార్లబండతండా మీదుగా ఆముదంబండతండా మలుపు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ రోడ్డు నిర్మాణంతో పాటు మధ్యలో అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం శివారు మధ్యలో ప్రవహిస్తున్న పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి రూ.4.70 కోట్లు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి.



పెద్దవాగుపై వంతెన నిర్మించే ప్రాంతం

ప్రారంభం కాని పనులు..

7.3 కిలోమీటర్ల పొడువునా బీటి రోడ్డు నిర్మాణానికి అప్పారెడ్డిపల్లిలో రోడ్డు పనులకు, పర్వతాపురం శివారులో బ్రిడ్జి పనులకు 2021 జూలై 8న శంకుస్థాపనలు చేశారు. రెండున్నర సంవత్సరాలు అయినా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలందరికి మేలు..



మా గ్రామం నుంచి పర్వతాపురం మీదుగా వనపర్తి వెళ్లేందుకు బీటీ రోడ్డు మంజూరైంది. కానీ పనులు చేపట్టడం లేదు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో రెండు గ్రామాల ప్రజల మధ్య కాస్త దూరం పెరిగింది. రోడ్డు వేస్తే పర్వతాపురంతో పాటు గిరిజన తండాలు, వ్యవసాయ పొలాలకు, వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ఉపయోగంగా ఉంటుంది.

– కృష్ణయ్య, అప్పారెడ్డిపల్లి


ఇబ్బందులు తొలగిపోతాయి..



మా గ్రామం నుంచి అడవి బాట వెంట గార్లబండతండా వరకు ఉన్న వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ఈ మట్టి రోడ్డు కాస్త బీటీగా మారిస్తే ఇబ్బందులు తొలిగిపోతాయి. అదేవిధంగా వనపర్తికి వెళ్లేందుకు ఖిల్లాఘనపురం మండల కేంద్రానికి వెళ్లి అక్కడి నుంచి వెళ్తున్నాం. ఈ రోడ్డు పూర్తయితే నేరుగా తక్కువ సమయంలో వెళ్లేందుకు వీలుంటుంది.

– గోవర్ధన్‌రెడ్డి, పర్వతాపురం

త్వరలో పనులు ప్రారంభిస్తాం..



అప్పారెడ్డిపల్లి నుంచి పర్వతాపురం, గార్లబండతండా మీదుగా ఆముదంబండ తండా వరకు 7.3 కిలోమీటర్ల రోడ్డుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్ పక్రియతో పాటు రోడ్డు పనులకు శంకుస్థాపన పూర్తయ్యింది. ఉన్నతాధికారుల సూచన మేరకు త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

– కబీర్‌దాస్, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ

చేనేత రంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న రామలింగేశ్వరకామ్లే

ఆత్మకూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగాన్ని విస్మరిస్తున్నాయని స్వకులశాలీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు రామలింగేశ్వరకామ్లే విమర్శించారు. ఆదివారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్రకార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాలు చేనేత రంగం, నేతన్నల సంక్షేమంకోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేద కార్మికులకు అందడం లేదన్నారు. చేనేత రంగాన్ని గట్టెక్కించేందుకు ప్రభుత్వాలు క్లస్టర్లను ఏర్పాటు చేసి నేరుగా నేతన్నలకు ఆర్థికసాయం, సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. చేనేత పరిశ్రమల్లో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించేలా నేతన్నలు ముందుకెళ్లాలన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికుల రుణాలను మాఫీ చేయాలని, ఆధునిక పనిముట్లను అందించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, శశిరేఖ, తుకారాం, సూర్యప్రకాష్, విఠల్‌రావ్‌సూపే, రమేష్, శ్రీనివాసులు, జిందేగోపి, జిందేమురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



మూలమళ్లలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు



గుంటిపల్లి గ్రామంలో..



కత్తేపల్లి గ్రామంలో..

బడ్జెట్ రావడం లేదు

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేని కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు రాకపోవడంతో గ్రామాల్లో సర్పంచ్‌ల ద్వారా, మున్సిపాలిటీ ద్వారా కంచెలను ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఇది వరకు ఆత్మకూర్ పట్టణంలో కొన్నింటికి కంచెలను ఏర్పాటు చేశారు.

– నర్సింహులు, ఏఈ ట్రాన్స్‌కో, ఆత్మకూర్

ఆత్మకూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయనే భయంతో ఆయా కాలనీవాసులు ఆందోళనకు చెందుతున్నారు. పట్టణంలోనే పరిస్థితి చక్కబెట్టని అధికారులు గ్రామాలవైపు కన్నెత్తి చూడడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని పిన్నంచర్ల, బాలకిష్టాపూర్, ఖానాపూర్, గుంటిపల్లి, తిప్పడంపల్లి, జూరాల, మోట్లంపల్లి, మేడేపల్లి, రేచింతల, కత్తేపల్లి, తూంపల్లి, వీరరాఘవపూర్, మూలమళ్లలో ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేసిన 54 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయలేకపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రత లేకపోవడంతో మూగజీవాలు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వరిధాన్యం నిల్వలో నిర్లక్ష్యం



సంచుల నుంచి బయటకు వచ్చిన వరిధాన్యం

కొత్తకోట రూరల్: వరిధాన్యం నిల్వ ఉంచడంలో అధికారుల నిర్లక్ష్యం బహిర్గతమైంది. మండలంలోని మిరాసిపల్లి సమీపంలో గల ఇషాన్ ట్రేడర్స్ రైస్ మిల్లు యజమానికి సివిల్ సప్లయి అధికారులు రైతుల నుంచి కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని అప్పగించారు. సదరు రైస్‌మిల్లు యజమాని గోదాంలో, లేకుంటే వరిధాన్యం తడవకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలి. ఇదే ధాన్యంతో ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాలి. అయితే మిల్లు యజమానికి గత ప్రభుత్వంలో రాజకీయ నాయకుల అండదండలతో అధికారులను తప్పుదోవ పట్టించాడనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. రైస్‌మిల్లుకు దాదాపు కిలోమీటర్ దూరంలో ఓ గుట్టను చదును చేసి గుట్టపై వరిధాన్యాన్ని ఉంచి వాటిపై కవర్లు కప్పి ఉంచాడు. కవర్లు ఎండకు ఎండి, వానకు తడిసి కలర్ మారాయి. అక్కడకు వెళ్లిన వెంటనే వరిధాన్యం ముక్కిపోయిన వాసన వస్తుండంతో అధికారుల పనితీరుపై ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. గోదాం లేకుండా వరిధాన్యం ఎలా భద్రపర్చుతాడో చూసుకోకుండా గుడ్డిగా రైస్‌మిల్లు యజమానిని నమ్మి వేల బస్తాలను ఇలా అప్పగించి నిర్లక్ష్యంగా ఉంచితే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అయితే సదరు రైస్ మిల్లు యజమాని ప్రభుత్వానికి ఇచ్చే సీఎంఆర్ బియ్యం సకాలంలో ఇవ్వకపోవడంతో మిల్లు సీజ్ చేయడంతో పాటు యజమానిపై క్రిమినల్ కేసు కూడా చేశారు. మిల్లులోని వరిధాన్యాన్ని వారం రోజుల నుంచి అధికారులు ఇతర మిల్లులకు తరలిస్తున్నారు. అయితే గుట్టపై ఉంచిన వరిధాన్యం నిల్వ సంగతేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



మిరాసిపల్లి శివారులో గుట్టపై నిల్వ ఉంచిన వరిధాన్యం



ఎలాంటి భద్రత లేకుండా నిల్వ ఉంచిన ధాన్యం

లాలా లజపతిరాయ్‌కు నివాళి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత లాలా లజపతి రాయ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కమ్మరి గోపి మాట్లాడుతూ భారత స్వతంత్ర సంగ్రామంలో బ్రిటీష్ రాజుకు వ్యతిరేకంగా పోరాడిన ధీరులలో ఆయన ఒకడిగా చిరస్థాయిగా నిలిచిపోయాడన్నారు. ఆయనను భారతీయులు పంజాబ్ కేసరి అనే బిరుదు ఇచ్చారన్నారు. ఇవ్వడం ఆయనను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బెస్త భాస్కర్, రమేష్, శివ, శ్రీనువాసులు, సుల్తాన్, యువకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎస్.రాములమ్మ అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జేఎస్ ఆర్ ఫౌండేషన్ సభ్యులు వారికి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో దయానంద రాజు, ప్రశాంత్, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



బిచ్చమ్మ

పెబ్బేరు రూరల్: మండలంలోని తిప్పాయిపల్లికి చెందిన సంధ్యపాగ బిచ్చమ్మ ఈ నెల 24 తేదీ నుంచి కనపడడం లేదని కుమారుడు సురేష్ ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈమె కూలీ పని చేసుకుంటు కుటుంబాన్ని పోషిస్తుంది. అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 24వ తేదీన ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించుకునేందుకు పెబ్బేరుకు వెళ్లింది. ఆ తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అడుగడుగునా లీకేజీలు



తూక్యానాయక్ తండా సమీపంలో పైపులైన్ లీకేజీతో నిలిచిన నీరు



అమరచింత పట్టణంలోని ఊరడమ్మ ఆలయ సమీపంలో లీకేజీ

అమరచింత: మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ పైపులైన్లు అడుగడుగునా లీకేజీలు అయ్యి తాగునీరు వృథాగా పారుతుంది. పట్టణంలోని ఊరడమ్మ ఆలయ సమీపంలో ప్రధాన సీసీ రహదారిపై తక్కువ లోతులో ప్లాస్టిక్ పైపులైన్ వేయడంతో భారీ వాహనాలు వెళ్లిన ప్రతిసారి పైపులు పగిలిపోతున్నాయి. దీంతో డ్రైయినేజీలోని నీరు పైపులైన్ వెంట వెళుతుంది. తూక్యానాయక్ తండాకు వెళ్తున్న పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీరు నిల్వ ఉండి ఒక మడుగుల తయారైంది. లీకేజీల ద్వారా కలుషిత నీరు సరఫరా అయ్యి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థినిపై పోలీసుల తీరు అమానుషం



మాట్లాడుతున్న కట్టా శ్రీనివాసులు

కొల్లాపూర్: ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీరాణిపై పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కట్టా శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ, ఉద్యాన యూనివర్సిటీలో హైకోర్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించడాన్ని నిరసిస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు ఝాన్సీరాణి జుట్టుపట్టుకొని లాక్కెళ్లడం దారుణమన్నారు. ఇటువంటి ఘటనలు సభ్యసమాజానికి సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం విచారణ చేసి పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నాంచారిగౌడ్, ప్రభాకర్, శంకర్ తదితరులున్నారు.

పోటెత్తిన భక్తులు



ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. కొల్లాపూర్, గద్వాల, పెబ్బేరు, వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి మేకపొట్టేళ్ళు, కోళ్లు బలిచ్చి నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తగిన ఏర్పాటు చేశామని ఎండోమెంట్ అధికారి రంగారావు తెలిపారు.

ముమ్మరంగా నేషనల్ హైవే పనులు



పెద్దకొత్తపల్లిలో కొనసాగుతున్న నేషనల్ హైవే పనులు

పెద్దకొత్తపల్లి: కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు ఏర్పాటు చేస్తున్న 167కే నేషనల్ హైవే పనులు మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మండల కేంద్రం నుంచి సాతాపూర్ వరకు రోడ్డు పనులు చేపట్టారు. రోడ్ల వెడల్పుతో పాటు సైడు డ్రెయినేజీలను నిర్మిస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు విద్యుత్ లైన్లను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేస్తూ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.

బీజేపీ విధానాలతో కార్మికులకు ఇబ్బందులు



మాట్లాడుతున్న రాములు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో నిరుద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు ఆరోపించారు. ఆదివారం ఇండస్ట్రియల్ ఏరియాలోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో ఉమ్మడి రైతు వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా సదస్సు నిర్వహించారు. బీజేపీ వినాశకరమైన అభివృద్ధి నిరోధక విధానాలు ప్రమాదకరంగా మారాయన్నారు. వారి పాలనలో దేశంలో 50 శాతం నిరుద్యోగం పెరిగిందని, 20 శాతం కార్మికుల వేతనాలు పడిపోయాయన్నారు. దేశంలోని పలు సమస్యలను పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఫిబ్రవరి 16న జరిగే సమ్మెలో సకల కార్మికులు, రైతు, వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి కురుమూర్తి, కిల్లెగోపాల్, ఆయా సంఘాల నాయకులు రామ్మోహన్, శ్రీనివాసులు, రాములు, కె.మోహన్, లక్ష్మయ్య, గోనెల రాములు, వరద గాలెన్న, ఆనంద్, ఎర్రశ్రీనివాసులు, చంద్రకాంత్, జగన్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

మాశమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న భక్తులు

ఆత్మకూర్: మండలంలోని మోట్లంపల్లిలో చిన్నబావి మాశమ్మ ఆలయ నిర్మాణానికి ఆదివారం వైస్ ఎంపీపీ కోటేష్, నాయకులు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఆలయం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో గ్రామస్తులు, భక్తులు నిధులను సమకూర్చి ఆలయ పునర్నిర్మాణానికి పూనుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాగన్న, దశరథ్, నరేందర్‌రెడ్డి, రాములు, గట్టన్న, నర్సింహ, రంగారెడ్డి, గోవిందు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కష్టపడి పనిచేయాలి

అడ్డాకుల: గ్రామాల్లో పార్టీ పటిష్టతకు యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని మూసాపేట మండల యూత్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. సంకలమద్ది, తిమ్మాపూర్ గ్రామాల్లో ఆదివారం యూత్ కాంగ్రెస్ బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. సంకలమద్దిలో 83వ బూత్‌నకు సురేందర్ ముదిరాజ్‌ను ఎంపిక చేశారు. తిమ్మాపూర్‌లో 79వ బూత్‌నకు హరి శంకర్‌గౌడ్‌ను ఎంపిక చేసినట్లు వివరించారు. బూత్‌స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా యూత్ నాయకులు కృషి చేయాలని కోరారు. నూతన అధ్యక్షులను సత్కరించి అభినందించారు.

ఐక్యంగా సమస్యల పరిష్కారానికి కృషి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: లంబాడ, ఎరుకల, చెంచు ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో గిరిజన ఉద్యోగ సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గిరిజన భవన్ నిర్మాణానికి రూ.10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. సంఘం నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చిద్దామన్నారు.